వర్లకుంటను రెండు ప్రాంతాల్లో ఎలా చూపుతారు?

అధికారులపై అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆగ్రహం 7



తూప్రాన్ ఉధృతంగా ప్రవహిస్తున్న హల్దీవాగు

హల్దీవాగుకు జలకళ

తూప్రాన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : హల్దీవాగు జలకళను సంతరించుకున్నది. నాలుగు రోజుల క్రితం కొండపోచమ్మసాగర్ నుంచి సంగారెడ్డి కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. రైతులు పంటలు కాపాడుకోవడానికి నీటిని విడుదల చేయాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరగా, మంత్రి ఆదేశాలతో నీరు విడుదలైంది. మంగళవారం రాత్రి మెదక్ జిల్లాలోని యావాపూర్ వద్ద హల్దీవాగులోకి నీరు ప్రవేశించగా, బుధవారం తూప్రాన్, మాసాయిపేట మండలాల్లోని హల్దీవాగుకు చేరాయి. నీటిని విడుదలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అసెంబ్లీ సాక్షిగా చారిత్రాత్మక నిర్ణయాలు

ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్లపై మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్

సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్, మంత్రుల కృషి అనిర్వచనీయం

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డిలో సంబరాలు





సంగారెడ్డిలో కృతజ్ఞత ర్యాలీ నిర్వహిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల ఆమోదంతో మిఠాయిలు తినిపిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జునఖర్గే నాయకత్వంలో రాహుల్‌గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీ సాక్షిగా చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద బాణాసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. బీసీ, ఎస్సీ వర్గాల ప్రజలకు నిర్మల స్వయంగా మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల ఆంజనేయులు, తోపాజి అనంత కిషన్, సీడీసీ రాంరెడ్డి, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



గుమ్మడిదలలో పోలీసుల కవాతు

ప్యారానగర్‌లో హైటెన్షన్

పోలీసుల వలయంలో మూడు గ్రామాలు

నల్లవల్లిలో 144 సెక్షన్ విధించి డంపుయార్డ్ పనుల ప్రారంభం

రాత్రి 2 గంటల నుంచే పోలీసుల యాక్షన్

ఎక్కడక్కడ నాయకుల అరెస్టులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్‌లో 150 ఎకరాల్లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న డంపుయార్డ్ పనులను బుధవారం ప్రారంభించగా, గ్రామంలో హైటెన్షన్ నెలకొన్నది. రెండేళ్లుగా అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలతో అడ్డుకుంటూ వస్తుండడంతో బుధవారం పోలీసుల సహకరంతో జీహెచ్‌ఎంసీ అధికారులు పకడ్బందీ చర్యలతో రంగంలోకి దిగారు. గుమ్మడిదల, నల్లవల్లి, మంబాపూర్ గ్రామాలు పూర్తిగా పోలీసుల వలయంలోకి వెళ్లాయి. నల్లవల్లిలో 144 సెక్షన్‌ను విధించారు. గుమ్మడిదలలో పోలీసులు కవాతు చేశారు. ప్యారానగర్ డంపుయార్డ్ స్థలం చుట్టూ అడుగడుగునా పోలీసు బలగాలు మోహరించాయి. నల్లవల్లిలో ప్రతీ చౌరాస్తాలో పహారా ఏర్పాటు చేశారు. రాత్రి 2 గంటల నుంచే పోలీసులు నల్లవల్లిలో నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని ఇతర ప్రాంతాల పోలీస్‌స్టేషన్లకు తరలించారు. విషయం తెలుసుకుని ఉదయం డంపుయార్డ్ పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిని ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు అఖిలపక్ష నాయకులు విద్యాసంస్థల బంద్‌ను చేపట్టారు. గుమ్మడిదలలో రైతులు, అఖిలపక్ష పార్టీ నాయకులు ధర్నా చేపట్టగా అక్కడికి చేరుకున్న పోలీసులు అందరినీ అరెస్ట్ చేసి డీసీఎంలో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకుని నల్లవల్లి వచ్చిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డిని సైతం అరెస్ట్ చేశారు. రాత్రి 2 గంటల నుంచి పోలీసుల చర్యలతో నల్లవల్లిలో హైటెన్షన్ వాతావరణం నెలకొన్నది. 144 సెక్షన్‌ను ప్రకటించి గ్రామస్థులను ఎవరినీ బయటకు రానీయకుండా డంపుయార్డ్ పనులను చేపట్టడంతో స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.



నర్సాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు

డంపుయార్డుతో అడవికి పెనుముప్పు

నర్సాపూర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : ప్యారానగర్‌లో ఏర్పాటు చేయనున్న డంపుయార్డుతో నర్సాపూర్ అడవితో పాటు సమీపంలోని చెరువులకు పెనుముప్పు వాటిల్లుతుందని, డంప్‌యార్డు వద్దంటూ నర్సాపూర్‌లో బుధవారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై బీజేపీ, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, అసెంబ్లీ కన్వీనర్ రమణారావు, మాజీ కౌన్సిలర్లు యాదగిరి, రమేష్‌యాదవ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్, బీఆర్‌ఎస్ యువజన నాయకుడు రాకేష్‌తో పాటు నాయకులు మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై బస్టాండు సమీపంలో రోడ్డుపై బైఠాయించారు. పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో రోడ్డుపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి ట్రాఫిక్‌స్తంభించింది. పోలీసులు వచ్చి నచ్చచెప్పి ఆందోళన విరమింపచేశారు.

ఎదురుచూపులు

సంక్షేమ పథకాల కోసం అర్హుల పడిగాపులు

మండలానికో పంచాయతీలోనే ప్రారంభం

పూర్తిస్థాయిలో అమలుకు శ్రీకారం ఎప్పుడో?

మెదక్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన నాలుగు సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో ఎప్పుడెప్పుడు అమలు చేస్తారా అని అర్హులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎంపిక చేసిన గ్రామాల్లో మాత్రమే లాంఛనంగా ప్రారంభమైంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కింద ఒక్కో లబ్ధిదారుడికి రూ.6 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న కుటుంబాలకు రేషన్‌కార్డులు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి లబ్ధిదారులకు ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేసినా వివరాలు బహిర్గత పర్చడం లేదు. గ్రామసభలను నిర్వహించి ఈ పథకాలకు అర్హులను ఎంపిక చేయగా, జాబితాలో చోటు దక్కని వారి నుంచి ఆందోళన వ్యక్తం కాగా, అధికారులు మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు. ప్రస్తుతం వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. అయితే, మండలానికో గ్రామంలోనే పథకాలు అందగా పూర్తిస్థాయిలో అమలుకు ఎప్పుడు శ్రీకారం చుడతారని లబ్ధిదారులు పడిగాపులు కాస్తున్నారు. ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడంతో సంక్షేమ పథకాల అమలుపై సందిగ్ధత నెలకొని ఉంది.



21 గ్రామాల్లోనే పథకాలు

మెదక్ జిల్లా వ్యాప్తంగా మండలానికి ఒక గ్రామం చొప్పున 21 గ్రామ పంచాయతీలలో నాలుగు సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేసి మంజూరు పత్రాలను అధికారులు అందించారు. రైతు భరోసా పథకానికి సంబంధించి జిల్లాలోని 21 గ్రామాలకు చెందిన 14,819 మంది రైతులను ఎంపిక చేసి ఒక్కో రైతుకు తొలి విడతగా రూ.6 వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో రూ.13.52 కోట్లను జమ చేశారు. మిగతా లబ్ధిదారులకు సంబంధించి డబ్బు ఎప్పుడు జమఅవుతుందో అధికారుల వద్ద నుంచి స్పష్టత లేదు. ఇక ఆత్మీయ భరోసా కింద ఉపాధిహామీ ద్వారా ఇరవై రోజులు పని చేసిన, భూమి లేని 586 మందికి రూ.6 వేలు చొప్పున రూ.35.16 లక్షల నగదు జమ చేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకూ ఆత్మీయ భరోసా పథకానికి 14,051 మంది ఎంపికయ్యారు. ఇందులో సుమారు 3 వేల వరకు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని, వాటిని విచారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆహార భద్రత కార్డుల కోసం జిల్లా వ్యాప్తంగా 11,515 దరఖాస్తులు రాగా, అందులో 691 మందిని అనర్హులుగా గుర్తించి తొలగించారు. 10,824 దరఖాస్తులకు ఆమోదం పొందినట్లు సివిల్ సప్లై అధికారులు పేర్కొన్నారు. తొలి విడతగా 21 గ్రామాల పరిధిలో 406 కుటుంబాలకు రేషన్‌కార్డులు అందజేయడంతో పాటు 224 క్వింటాళ్ల బియ్యాన్ని ఫిబ్రవరి కోటా కింద పంపిణీ చేశారు. ఈ 21 గ్రామ పంచాయతీలు మినహా మిగతా చోట్ల అర్హులు కూడా తమకెప్పుడు ఈ పథకాలు అందుతాయా అని ఎదురుచూస్తున్నారు.

నులి పేద్దాం

నులిపురుగులతో అనర్థాలు

నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి 7

అన్న కొడుకే హంతకుడు

శివ్వంపేట హత్య కేసు ఛేదన

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని అందించాలి
- రాష్ట్ర గ్రామీణ మంచినీటి సరఫరా చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు



ఇసోజీపేట గ్రామంలో పర్యటిస్తున్న వెంకటేశ్వర్లు

పుల్‌కల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవి సీజన్‌లో నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర గ్రామీణ మంచినీటి సరఫరా చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు సూచించారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజనీర్లతో కలిసి మండలంలోని ఇసోజీపేట గ్రామంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం ఆయన పర్యటించారు. వెంకటేశ్వర్లు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు నీటి సమస్యలు ఏమైనా ఉన్నాయా, తాగునీరు ప్రతీ రోజు సరఫరా అవుతుందా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా క్షేత్రస్థాయిలో ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మోటారు పంపులు, రిపేర్లు ముందస్తుగా చేసుకోవాలని సూచించారు. ప్రతీ రోజు ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు అందించాలన్నారు. ఏమైనా లోటుపాట్లు ఉంటే సరిచూసుకోవాలన్నారు. ప్రజల అవసరాల మేరకు నీటిని అందించే బాధ్యత అధికారులదేనని గుర్తు చేశారు. వేసవి సీజన్‌లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సేవలందించాలన్నారు. అనంతరం హన్నాపూర్‌లోని నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట జోగిపేట సబ్ డివిజన్ డిప్యూటీ ఈఈ ఎం.శేషగిరిరావు తదితరులు ఉన్నారు.

మెదక్‌లో కేంద్రీయ విద్యాలయం

ఏర్పాటు దిశగా అడుగులు

అనువైన స్థల సేకరణలో జిల్లా యంత్రాంగం

వచ్చే విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి వచ్చే అవకాశం

మెదక్ అర్బన్, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. నాణ్యమైన విద్య, అత్యుత్తమ బోధన విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో కేవీలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు మంచి డిమాండ్ ఉంది. విద్యాపరంగా వెనుకబడిన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలో ఇప్పటి వరకు కేంద్రీయ విద్యాలయం కానీ, నవోదయ పాఠశాల లేదు. సిద్దిపేట జిల్లాలో నవోదయ, కేంద్రీయ విద్యాలయం ఉండగా.. ఇటీవల సంగారెడ్డి జిల్లాకు నవోదయ పాఠశాల మంజూరైంది. మెదక్ జిల్లాలో కస్తుర్బా, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలే కొనసాగుతున్నాయి. స్పందించిన కేంద్ర ప్రభుత్వం మెదక్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు ముందుక వచ్చింది. ఈ మేరకు 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని, లేదా తాత్కలిక భవనాన్ని ఎంపిక చేయాలని 2022-23 విద్యాసంవత్సరంలో జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. నాటి నుంచి అనువైన స్థల అన్వేషణలో అధికార యంత్రాంగం ఉండడటం గమనార్హం. ఎట్టకేలకు జిల్లా యంత్రాంగంలో కదలిక వచ్చింది. దాంతో అనువైన స్థలంతోపాటు తాత్కలిక భవనం కోసం జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది.

త్వరలో కేంద్ర బృందం రాక

విద్యాలయ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు కలెక్టర్ రాహుల్‌రాజ్ బుధవారం మెదక్ మండల పరిధిలోని పాతూర్‌లో ఐదెకరాల స్థలాన్ని పరిశీలించారు. జిల్లా నుంచి ప్రాతిపదనలు పంపగానే కేంద్ర మానవ వనరులు అభివృద్ధి శాఖ అధికారులు ఏర్పాట్లను పరిశీలించేందుకు త్వరలో రానున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.



కేంద్రీయ విద్యాలయ నిర్మాణం కోసం పాతూర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

విద్యార్థులకు నాణ్యమైన విద్య

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటైతే మెదక్ జిల్లా ప్రాంత విద్యార్థులకు జాతీయస్థాయి సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందనున్నది. సౌకర్యవంతమైన తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, వైద్యం, క్యాంటీన్, క్రీడా సౌకర్యాలు అందుతాయి. ప్రయోగాత్మక అభ్యసన అనుభవాలను విద్యార్థులకు అందించేందుకు సైన్స్, కంప్యూటర్, లాంగ్వేజ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తారు. గ్రంథాలయంలో కేంద్రీయ విద్యాలయ పుస్తకాలు, మ్యాగజైన్‌లు, వార్తా పత్రికలు, ఇతర రీడింగ్ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతారు. విద్యార్థులకు సువిశాలమైన క్రీడా మైదానాలను ఏర్పాటు చేసి, క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, వాలీబాల్ వంటి క్రీడా సామగ్రిని అందుబాటులో ఉంచుతారు. విద్యార్థులకు వైద్య సహాయం అందించేందుకు పాఠశాలలో క్లినిక్‌ను ఏర్పాటు చేస్తారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, మాజీ సైనికుల పిల్లలకు ప్రవేశాల్లో తొలి ప్రాధాన్యత కల్పిస్తారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల ఉద్యోగులకు రెండు, మూడు, నాల్గో ప్రాధాన్యత ఇస్తారు. తరువాత ప్రాధాన్యతగా ఇతర విద్యార్థులను చేర్చుకుంటారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యాలయాన్ని అందుబాటులోకి తెచ్చేవిధంగా అడుగులు పడుతున్నాయి. అన్ని సౌకర్యాలలు కల్పిస్తే.. అనుమతి మంజూరు చేసి వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రవేశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.



స్వామివారికి అభిషేకం చేసేందుకు సిద్ధం చేసిన కలశాలు

పుష్కర బ్రహ్మోత్సవాల్లో 1001 కలశాలతో అభిషేకం

రామాయంపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేటలో వేంకటేశ్వర స్వామి పుష్కర బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. బుధవారం 1001 కలశాలతో స్వామికి అభిషేకం చేశారు. తదనంతరం ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్‌గౌడ్ మాజీ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి ఉన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పగడ్బందీగా అమలు చేయాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజనాన్ని పగడ్బందీగా అమలు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మెదక్ మండలం పాతూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆర్డీవో రమాదేవితో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, డైనింగ్‌హాల్, క్లాస్‌రూములు, పరిసరాలు, స్టోర్స్ వంట గదుల్లో తిరుగుతూ స్వయంగా తనిఖీ చేశారు. కిచెన్‌షెడ్‌లో భోజనం తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంటకు పరిశుభ్రమైన నీటిని వినియోగించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. భోజనం వండటానికి ముందే ప్రతీ రోజు క్రమం తప్పకుండా ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నాసిరకం, నాణ్యతాలేమితో కూడిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో వినియోగించకూడదని ఆదేశించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు న్యాయం చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభ ఆమోద ముద్ర వేయడంపార్టీ పట్టణ అధ్యక్షుడు, కార్పొరేటర్ పుష్పానగేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ సండే మార్కెట్ ప్రాంతంలో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు పర్వాశ్యాం, ప్రభాకర్, అరుణ్‌గౌడ్, మవీన్‌గౌడ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నుంచి రక్ష

- ఎంఆర్ఎఫ్.. సీఎస్ఆర్ నిధులతో ఆధునిక హంగులతో భవనం..
- ఫోమ్‌తో మంటలార్పే ఫైరింజన్లు
- నిమిషాల్లో నీరు నిండేలా ఏర్పాటు
- సిబ్బందికి రెస్ట్‌రూం, కిచెన్ రూం



సదాశివపేటలో నిర్మించిన ఆధునిక ఫైర్ స్టేషన్ భవన సముదాయం

సదాశివపేట, ఫిబ్రవరి 5: (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నుంచి రక్ష లభించనున్నది. సదాశివపేట పట్టణంలో శిథిలావస్థలో ఉన్న దశాబ్దాల కాలం నాటి ఫైర్ స్టేషన్ ఆవరణలో ఎంఆర్ఎఫ్ యాజమాన్యం తన సీఎస్ఆర్ నిధులతో ఆధునిక హంగులతో.. సకల సౌకర్యాలతో ఫైర్ స్టేషన్ భవన సముదాయాన్ని నిర్మిస్తోంది. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అత్యవసరంగా నిమిషాల్లో ఫైర్ ఇంజన్‌లోకి నీరు నిండేలా కొత్త ఫైర్‌స్టేషన్ భవన సముదాయంలో మోటార్లు, వాటర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. ఫార్మా, రసాయన పరిశ్రమల్లో, పెట్రోల్ బంకుల్లో భారీ హోటల్స్, మాల్స్‌ల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అత్యంత ఎత్తుతో ఎగిసిపడే మంటలను సైతం ఫోమ్‌తో ఆర్పివేసే ఫైర్ ఇంజన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇక్కడ మొత్తం రెండు ఫైర్ ఇంజన్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఎంఆర్ఎఫ్ యాజమాన్యం నిర్మించిన కొత్త ఫైర్ స్టేషన్ భవనంలో మూడు ఫైర్ ఇంజన్లు నిలిచే సదుపాయంతోపాటు అగ్ని మాపక శాఖ అధికారులు, సిబ్బంది కోసం రెస్ట్ రూమ్‌లు, అడ్మినిస్ట్రేషన్ రూమ్, కాన్ఫరెన్స్ హాల్, కిచెన్ రూమ్, స్టోర్ రూమ్‌లు ఇతర ప్రత్యేక గదులు నిర్మిస్తున్నారు. ప్రాశ్చాత్య దేశాల్లోని ఫైర్‌స్టేషన్ భవనాల నమూనాలను పరిశీలించి అన్ని రకాలుగా అనుకూలమైన డిజైన్‌తో పట్టణంలో 65వ జాతీయ రహదారి పక్కన నిర్మించిన కొత్త ఫైర్ స్టేషన్ హైదరాబాద్ నగర శివారులోని సాఫ్టవేర్- కార్పొరేట్ భవనాల డిజైన్ పోలి ఉండడం గమనార్హం. సదాశివపేట కొత్త ఫైర్ స్టేషన్ సేవలు ఉమ్మడి మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల పరిధిల్లోని పట్టణాలు, గ్రామాలతో పాటు రంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామాలకు కూడా అందుబాటులోకి రానున్నాయని అగ్ని మాపక శాఖ అధికారులు చెబుతున్నారు.



అందుబాటులో ఉన్న ఫైర్ ఇంజన్ వాహనాలు

'పది'లో మంచి ఫలితాలు సాధించాలి: డీఈవో



మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

మెదక్/వెల్దుర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పది విద్యార్థులు చక్కటి ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయుల బోధన సాగుతోందని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. బుధవారం రామాయంపేటలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తరగతి గదులకు వెళ్లి పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా రాయాలన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో బుధవారం వెల్దుర్తి, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, మానేపల్లి, మంగళపర్తి పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు త్వరలో జరిగే వార్షిక పరీక్షలు, జీవన నైపుణ్యాలపై లైఫ్ స్కిల్ ట్రైనర్ సునీతారాకేశ్ అవగాహన కల్పించారు.

నులి పురుగుల నిర్మూలనపై శిక్షణ



రేగోడులో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న వైద్యాధికారి

రేగోడు/చేగుంట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నులి పురుగుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రేగోడు వైద్యాధికారి వికాస్ అన్నారు. బుధవారం రేగోడులో జాతీయ నులి పురుగుల నిర్మూలనపై ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు 10న నులిపురుగుల మాత్రలు వేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వర్‌గౌడ్, ఎంఈవో గురునాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చేగుంట ఎంపీపీ కార్యాలయంలో ప్రాథమిక వైద్యాధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి, అంగన్‌వాడీ టీచర్లకు, ఆశావర్కర్లకు నులి పురుగుల నిర్మూలనపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంఈవో నీరజ పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

తూప్రాన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నెలరోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదంటూ తూప్రాన్ మండలం ఘణపూర్ గ్రామస్థులు బుధవారం నీటి సరఫరా విభాగం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలరోజులుగా గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని పంచాయతీ కార్యదర్శికి వివరిస్తే, నీటి సరఫరా విభాగం అధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆందోళన చేపట్టామన్నారు. ఉదయం 11 గంటలైనా అధికారులు కార్యాలయానికి రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ శేషాద్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఆకుల రవి, గ్రామ యువకులు పాల్గొన్నారు.

వేతనాల్లేక పోషణ భారం


మనోహరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నిత్యం పారిశుధ్య పనులు చేస్తున్న తమకు మూడునెలల నుంచి వేతనాల్లేక కుటుంబ పోషణ భారంగా మారిందని జీపీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ పంచాయతీ వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. నిత్యం పనులు చేస్తున్న తమకు సమయానికి వేతనాలు రావడం లేదన్నారు. అధికారులు పట్టించుకోని వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు స్వామి, చంద్రయ్య, వీరేష్, కృష్ణ, యాదమ్మ, సుజాత, నర్సింహా, నర్సింహాలు పాల్గొన్నారు.




కాళ్లకల్ గ్రామంలో విలేకరులతో గోడు వెల్లబోసుకుంటున్న కాళ్లకల్ పంచాయితీ కార్మికులు













డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సరఫరా

● వేసవిలో సబ్‌స్టేషన్లపై భారం పడకుండా ముందస్తు చర్యలు

● ట్రాన్స్‌కో జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనాథ్



ఇంజనీర్లకు సూచనలు ఇస్తున్న ఎస్‌ఈ

పటాన్‌చెరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరగనున్నందున కోతల్లేని నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరాకు పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ట్రాన్స్‌కో సంగారెడ్డి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనాథ్ ఆదేశించారు. బుధవారం వేసవి ప్రణాళికపై పటాన్‌చెరు సబ్‌డివిజన్ కార్యాలయంలో డీఈలు, ఏఈలతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. హైదరాబాద్ నగర శివారు ప్రాంతమే కాకుండా, పారిశ్రామిక వాడగా పేరుగాంచిన పటాన్‌చెరు పరిసరాలలో పెద్ద ఎత్తున విద్యుత్ వినియోగం ఉంటుందన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సరఫరా జరిగేలా చూస్తామన్నారు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని సబ్‌స్టేషన్లపై భారం పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో పటాన్‌చెరు ఆపరేషన్స్ డీఈ భాస్కర్‌రావు, పటాన్‌చెరు, బొల్లారం, గుమ్మడిదల, రామచంద్రాపురం ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై కాంగ్రెస్ ఫిర్యాదు



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నంగునూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ యథేచ్ఛగా బీఆర్ఎస్ నాయకులు పార్టీ జెండాలను ఆవిష్కరిస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి బుధవారం నంగునూరు ఎంపీడీవో లక్ష్మప్పకు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో ర్యాలీగా తిరుగుతూ పార్టీ జెండాలు ఆవిష్కరణ చేస్తూ కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చెలికాని యాదగిరి, జంగిటి శ్రీనివాస్, బాగు శ్రీకాంత్ యాదవ్, గౌరబోయిన సంపత్ ఆవుల నాగరాజు, విక్రమ్ రెడ్డి, మ్యాక సాగర్, సమ్మి బాబు, గడ్డం శివ, నీల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పీఈటీ మృతి

● విలపించిన విద్యార్థులు ● కొమురవెల్లిలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



అశోక్ (ఫైల్)

చేర్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామానికి చెందిన పీఈటీ పాశికంటి అశోక్(48) బుధవారం ఉదయం గుండెపోటుతో మరణించాడు. కొమురవెల్లి జడ్పీఎస్ఎస్ నుంచి ఆయన కొద్దిరోజుల క్రితమే దుబ్బాక మండలానికి బదిలీ అయ్యారు. స్థానికంగా పనిచేసిన కాలంలో విధినిర్వహణలో అంకితభావంతో వ్యవహరించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో విడదీయరాని అనుబంధాన్ని పెనవేసుకున్నాడు. ఆయన మృతి విషయాన్ని తెలుసుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు విలపించారు. పాఠశాల ఆవరణలో మౌనం వహించిన అనంతరం ర్యాలీ చేపట్టారు. అనంతరం మర్రిముస్త్యాల గ్రామానికి వెళ్లి అశోక్ మృతదేహానికి నివాళులర్పించారు. వి మిస్‌యూ సార్ అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. అశోక్ మృతిపై మాజీ జడ్పీటీసీ సిలివేరి సిద్దప్ప, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, నాయకులు తలారి కిషన్, పీడీ రఫత్ ఒమర్, రమేశ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వర్లకుంటను రెండు ప్రాంతాల్లో ఎలా చూపుతారు?



ఆర్డీవోతో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

ఐడీఏబొల్లారం ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) కుంటల వాస్తవ పరిస్థితులను స్పష్టంగా వివరించకుండా రెండు ప్రాంతాల్లో ఉండొచ్చంటూ ఎలా చూపుతారంటూ జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఐడీఏబొల్లారంలో హరిత ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు రెవిన్యూ, నీటిపారుదలశాఖ, సర్వేశాఖ, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారులతో కలిసి ప్రత్యక్ష విచారణ చేశారు. నీటిపారుదల, మున్సిపల్ శాఖలు చెబుతున్నట్లుగా గూగుల్‌లో ఒక సర్వేనంబర్‌లో వర్లకుంట ఉండగా, నివేదికలో మాత్రం మరో సర్వేనంబరు చూపడంపై ఆర్డీవో రవీందర్‌రెడ్డిను వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్లకుంటను పూర్తిగా మూసివేసిన వ్యవహారంపై ప్రత్యక్ష విచారణ జరుపుతున్నామని తెలిపారు. ఒకచోట ఉండాల్సిన వర్లకుంట మరో చోట కూడా చూపుతున్నందున దాన్ని కూడా చూసిన తరువాత హరితట్రైబ్యునల్‌కు నివేదిక ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, నీటిపారుదల శాఖ ఏఈ ప్రసాద్, సర్వేయర్లు రామభద్రం, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, టీపీవో పవన్ తదితరులు ఉన్నారు.



నులిపేద్దాం

నులిపురుగులతో అనర్థాలు

● నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి వేయించాలి

● 1-19 ఏళ్లలోపువారికి పంపిణీ

● ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవితాన్ని పిల్లలకు అందించడం తల్లిదండ్రుల కర్తవ్యం. అందు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉంది. పిల్లల్లో పోషకాహారలోపం, రక్తహీనత తగ్గించడం, శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పాటునందించాలి. ఆరోగ్య సమాజ స్థాపనలో భాగంగా ప్రభుత్వం.. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏటా జాతీయ నులిపురుగుల(నట్టల) నివారణ దినోత్సవాన్ని(ఎన్‌డీడీ-నేషనల్ డీవార్మింగ్ డే) నిర్వహిస్తున్నది. ఈ నెల 10న ఆ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయనున్నారు. ఆ రోజు ఏదేనీ కారణం చేత మాత్రలు వేయించని పిల్లలకు ఈ నెల 17న వేయించవచ్చు.

1 నుంచి 19 ఏళ్ల వారికి..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు నులిపురుగుల మాత్రలను వేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 3 సంవత్సరాల వయస్సు పిల్లలకు ఒక మాత్ర పొడి చేసి నీళ్లతో తాగిస్తారు. 3 నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లలందరికీ ఒక మాత్రను మింగించనున్నారు. 400 ఎం.జీ. పరిమాణంలో ఆల్బెండజోల్ మాత్ర ఉండనుంది. పిల్లల్లో సాధారణంగా మూడు రకాల నులిపురుగులు కనబడే అవకాశం ఉంది. ఏలిక పాములు, నులిపురుగుల, కొంకి పురుగులు ఉండనున్నాయి. నులిపురుగుల మాత్రల పంపిణీలో జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆరోగ్య శాఖ ఆశా కార్యకర్తలను భాగస్వాములు చేయనున్నారు.

అపరిశుభ్రతతో నులిపురుగులు

అపరిశుభ్రతతో నులిపురుగులు పిల్లలకు సంక్రమిస్తాయి. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే నులిపురుగులు వ్యాపిస్తాయి. చేతిగోర్లను శుభ్రంగా ఉంచుకోవాలి. పెరిగిన గోర్లలో మట్టిచేరి అనారోగ్యానికి కారణమవుతారు. అలాగే శుద్ధ జలం తాగాలి. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం వల్ల నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. భోజనం చేసేటప్పుడు శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. కూరగాయలను శుభ్రమైన నీటితో కడగాలి. ఆహార పదార్థాలపై ఎప్పుడు మూతలు కప్పి ఉంచాలి.

నులిపురుగులతో అనారోగ్యం..

నులిపురుగులతో పిల్లలకు అనేక అనర్థాలు కలుగుతాయి. ముఖ్యంగా నులిపురుగులనేవి పేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులు. వీటి ద్వారా శరీరంలో రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడంతో మరిన్నీ ఇబ్బందులు తలెత్తుతాయి. నులిపురుగుల నిర్మూలనతో రక్తహీనత నియంత్రణ పోషకాల గ్రాహ్యతను మెరుగుపర్చే ప్రయోజనాలను పుష్కలంగా కలుగజేస్తుంది.

మాత్రలు తప్పనిసరి వేయించాలి



పిల్లలందరికీ నులిపురుగుల ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి. ఇప్పటికే జిల్లాకు అవసరమైన మాత్రలను సిద్ధం చేశాం. ఈ మాత్రల వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. వీటి వల్ల చిన్నారుల్లో శారీరక, మానసిక ఎదుగుదల పెరుగుతుంది. మాత్రల పంపిణీకి అన్ని చర్యలు చేపట్టాం. తల్లిదండ్రులు సమీపంలోని అంగన్‌వాడీ, పాఠశాల, ఆరోగ్య కేంద్రం సిబ్బందిని సంప్రదించాలి. 10 న నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఆయా శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తాం.

- డాక్టర్ శశాంక్‌దేశ్‌పాండే, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, సంగారెడ్డి

19 ఏళ్లలోపు వారి సంఖ్య..

సంగారెడ్డి	4,05,207
సిద్దిపేట	2,42,800
మెదక్	2,36,607



ధర్నా చేస్తున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

సామాన్యుడికి మేలు చేయని బడ్జెట్

● కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ధర్నా

సంగారెడ్డి, రూరల్,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి) : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరణ చేయాలని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అఖిల భారత కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు మల్లేష్, నరసింహారెడ్డి మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కార్మిక రైతు ప్రజా సంక్షేమం కోసం నిధులు ఇవ్వకపోవడం అన్యాయన్నారు. కార్మికులకు కనీస వేతన ప్రతిపాదన లేకుండా సంపన్నులపై పన్నులు వేయకుండా పరోక్షంగా సమాన్య ప్రజలపై భారం పడేలా బడ్జెట్ ఉందన్ని ఆరోపించారు. రైతాంగాన్నికి గిట్టుబాటు ధర, ఉపాధిహామీకి నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రాష్ట్ర, జిల్లా నాయకులు జనార్దన్‌రెడ్డి, సాయిలు, ప్రసాద్, బాగారెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణనతో సామాజిక న్యాయం

● కాంగ్రెస్ నేత నీలంమధు

నర్సాపూర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనతో బీసీలకు సామాజికంగా, రాజకీయంగా న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నేత నీలం మధు పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్‌లో ముదిరాజ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముదిరాజ్ సంకల్పభేరి సభకు ఆయన తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రాజ్ఞానేశ్వర్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు ముఖ్యంగా ముదిరాజులకు పెద్ద ఎత్తున అవకాశాలు లభించనున్నాయన్నారు. బీసీ కుల గణన చేయడంతో బీసీల జనాభాలలో ముదిరాజుల శాతం తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కువగా ఉందని తేలిందన్నారు. చాలా రోజులుగా ముదిరాజులు బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చే డిమాండు పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ముదిరాజుల సంక్షేమ సమితి సభ్యులు నారాయణ, నర్సింలు, సురేష్, రమేష్, మత్స్య శాఖ డైరెక్టర్లు శ్రీనివాస్, మహేష్, నాయకులు సంతోష్, ఆంజనేయులు, కృష్ణ, సందీప్, సుజాతసత్యం, మనిదీప్, రాజేందర్, కిష్టయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు నీలం మధు

క్రైం కార్నర్

జీవితంపై విరక్తి చెంది రైతు ఆత్మహత్య

మునిపల్లి, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి) : జీవితంపై విరక్తి చెంది ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇబ్రహీంపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన మున్నూరు కృష్ణ (45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్ల నుంచి ఆయన మతిస్థిమితం సరిగా లేకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. దీంతో వివిధ ఆసుపత్రులకు చూపించినప్పటికీ రోగం నయం కాలేదు. ఈ నేపథ్యంలో కృష్ణ భార్య ఈ నెల 3న సదాశివపేటలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చి చూసే సరికి ఇంట్లో దూలానికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడి భార్య మన్నూరి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిప్పంటుకుని వృద్ధుడి మృతి

చేర్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వృద్ధుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కొమురవెల్లి మండలం గౌరాయపల్లి గ్రామానికి చెందిన కొమురవెల్లి లింగయ్య (68) అనారోగ్యంతో మంచానపడ్డాడు. రోజూలాగే బీడీ వెలిగించిన అనంతరం పక్కకు పారేసి దుప్పటి కప్పుకుని నిద్రపోయాడు. ఈ క్రమంలో నిప్పుచూరతో మంటలంటుకుని తీవ్ర గాయాలపాలయ్యాడు. కాసేపటి తరువాత గమనించిన చుట్టుపక్కలవాళ్లు 108అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స నిర్వహించేలోగా మృతి చెందాడు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

చెరువులో పడి యువకుడు..



శ్రావణ్‌కుమార్ (ఫైల్)

ములుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన ములుగు మండలం బండమైలారం గ్రామ శివారులో చోటుచేసుకుంది. బుధవారం ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శ్రావణ్‌కుమార్(23) కొంతకాలంగా ములుగు మండలం బండమైలారంలో ఉంటూ కంపెనీలలో పెయింటింగ్ వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తన స్నేహితులతో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాకపోయేసరికి వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా, బుధవారం ఉదయం గ్రామ శివారులోని రాణికుంట చెరువులో శ్రావణ్‌కుమార్ మృతదేహం కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమర్టానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ సిబ్బంది ఆకలి కేకలు

● మల్లన్న ఆలయ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలలుగా అందని వేతనాలు

● 14నెలలుగా జీఎస్టీ, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు చెల్లించని ఏజెన్సీ నిర్వాహకులు

చేర్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్ర జ్యోతి) : కమీషన్ డబ్బుల కోసం కక్కుర్తి పడ్డారో.. మరే ఇతర కారణంతో విస్మరించారో గానీ కొమురవెల్లి మల్లన్న ఆలయాధికారుల నిర్లక్ష్య వైఖరితో ఔట్ సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందడంలేదు. మల్లన్న ఆలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 30 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కొక్కరికి వేతనంకింద రూ.15వేల నుంచి రూ.26వేల వరకు ప్రతీ నెలా ఓ ప్రైవేటు ఏజేన్సీ ద్వారా చెల్లిస్తున్నారు. దీని కోసం సుమారు రూ.6లక్షలు ఏజేన్సీకి ఆలయం నుంచి అందుతున్నది. కాగా, ఏజెన్సీ నిర్వహకులు ప్రభుత్వానికి జీఎస్టీ, సిబ్బందికి ఈఎస్ఐ, ఈపీఎఫ్ చెల్లించాల్సి ఉండగా, శఠగోపం పెడుతున్నారు. ఈ విషయాన్ని ఎప్పటి కప్పుడు పరిశీలించాల్సిన ఆలయాధికారులు పట్టించుకోకపోవడంలేదు. ఇతర దేవాలయం నుంచి కొన్ని నెలలక్రితం మల్లన్న ఆలయానికి బదిలీపై వచ్చిన ఓ అధికారి నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ తతంగాన్ని గమనించడంతో అసలు విషయం వెలుగు చూసింది.

సెప్టెంబరు 2023 నుండి...

ఏజెన్సీ నిర్వాహకులు సెప్టెంబరు 2023 నుంచి అక్టోబరు-2024వరకు జీఎస్టీ, ఈఎస్ఐ, ఈపీఎఫ్ డబ్బులు చెల్లించలేదు. సంబంధిత రికార్డులేవీ ఆలయాధికారులకు సమర్పించకున్నప్పటికీ ఏజెన్సీ నిర్వాహకులకు చెల్లించారు. కానీ వారు ప్రభుత్వానికి జీఎస్టీ, ఇతర చెల్లింపులు చేయలేదు. ప్రతీ నెలా సుమారు రూ.2లక్షలు చొప్పున రూ.28లక్షలు బకాయి ఉండగా, ఇటీవల ఓ ద్వితీయశ్రేణి అధికారి ఈ తతంగాన్ని గమనించి ఏజెన్సీకి డబ్బుల చెల్లింపు నిలిపివేశారు. అయినప్పటికీ ఏజెన్సీ నిర్వహకుడు ఆయా పత్రాలు దాఖలు చేయకపోవడం, ఈవిషయమై ఆలయాధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో సిబ్బందికి మూడునెలలుగా వేతనాలు అందడంలేదు. ఏజెన్సీ నిర్వాహకులు దర్జాగా మాయచేసినా గుర్తించడంలో ఆలస్యం చేసిన అధికారులు ప్రత్యామ్నాయ చర్యల్లోనూ తాత్సారం వహిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మొత్తం బకాయి డబ్బులు కట్టిస్తాం : ఈవో రామాంజనేయులు

ఏజెన్సీ నిర్వాహకులు జీఎస్టీ, ఈఎస్ఐ, ఈపీఎఫ్ డబ్బులు చెల్లించని విషయం గుర్తించడంతో చెల్లింపు నిలిపివేశాం. దీంతో మూడు నెలల డబ్బులు చెల్లించారు. మిగతా నెలల బకాయి డబ్బులు కూడా కట్టిస్తాం. ఇక నుంచి మేమే నేరుగా చెల్లించేలా చూస్తాం. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఇబ్బందులుపడుతుండటాన్ని గమనించి చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నాం.

అన్న కొడుకే హంతకుడు

● ఆస్తి తగాదాలు, తండ్రిని చంపాడన్న కక్షతో..

● శివ్వంపేట హత్య కేసును ఛేదించిన పోలీసులు

● తూప్రాన్‌లో వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట్‌రెడ్డి



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తండ్రిని చంపాడన్న అనుమానం, ఆస్తి పంపకం చేయడంలేదన్న పగతో సొంత చిన్నాన్నను స్నేహితుడితో కలిసి హతమార్చాడు ఒకరు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం తిక్కుదేవమ్మగూడెం గ్రామ పంచాయతీ పరిధి సామ్యతండాలో ఈ నెల 1న జరిగిన ఈ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆ వివరాలను బుధవారం రాత్రి తూప్రాన్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి వెల్లడించారు. మాలోతు మదన్‌లాల్‌ను సొంతం అన్న తారాసింగ్ కుమారుడు మాలోతు భరత్ సేన్ హతమార్చినట్లు వివరించారు. హత్యకు గురైన మాలోతు మదన్‌లాల్ అన్న మాలోతు తారాసింగ్ కుమారుడు భరత్‌సేన్‌కు ఆస్తి తగాదాలు ఉన్నాయి. భరత్ సేన్ తండ్రి తారాసింగ్ 2016లో ప్రమాదవశాత్తు చనిపోవడంతో దానికి కారణం మదన్‌లాల్ అని అతను అనుమానం పెంచుకున్నాడు. మదన్‌లాల్, తారాసింగ్ మధ్య ఆస్తి పంపకాలు జరగకపోగా, దీనిపై ప్రశ్నిస్తే నివ్వు మా అన్నకు పుట్టావన్న నమ్మకం ఏంటంటూ అవమానిస్తూ మాట్లాడాడు. దీన్ని మనసులో పెట్టుకున్న భరత్‌సేన్ చిన్నాన్న మదన్‌లాల్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. దీంతో అతడు నార్సింగి మండలం జప్తిశివనూర్ గ్రామానికి చెందిన స్నేహితుడు మ్యాకల నవీన్(29) కారు అద్దెకు తీసుకు రమ్మని చెప్పాడు. ఈ మేరకు ఒకటవ తేదీ రాత్రి సామ్య తండాలోని మాలోతు మదన్‌లాల్ ఇంటికి ఇద్దరు వెళ్లి కత్తితో పొడిచి హత్య చేశారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. బుధవారం సాయంత్రం తూప్రాన్ శివారులో మాలోతు భరత్‌సేన్, మ్యాకల నవీన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును చేధించిన సీఐ రంగ కృష్ణ, ఎస్ఐలు మధుకర్‌రెడ్డి, సుభాష్‌గౌడ్, శివానందంలను డీఎస్పీ అభినందించారు.

కాంట్రాక్టర్‌కు కాసులు కురిపిస్తున్న రైల్వే మట్టి

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైల్వే సంస్థ సొమ్మును ఒక కాంట్రాక్టర్ తన జేబులోకి వేసుకుంటున్నాడు. ఇది కుకునూరుపల్లి మండలం లకుడారం రైల్వేస్టేషన్ వద్ద గత 15 రోజులుగా కొనసాగుతున్నది. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి రైల్వేలైన్ పనులలో భాగంగా ఒక వరుస రైల్వేలైన్ సిద్దిపేట వరకు పూర్తి అయినది. లకుడారం రైల్వేస్టేషన్ వద్ద మరో రెండు లైన్లను పలు అవసరాల కోసం రెండు లైన్లను నిర్మించడానికి పనులను చేపట్టారు. దీని కోసం మట్టిని తొలగించే పనులు చకచక జరుగుతున్నాయి.

రైల్వేలైన్ నిర్మించడానికి తీస్తున్న మట్టిని కాంట్రాక్టర్ లకుడారం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులకు భారీ ఎత్తున అమ్ముకుంటున్నాడు. ఒక్కో టిప్పర్‌కి రూ. 1500లకు అమ్ముకుంటున్నాడు. నల్లరేగడి మట్టి కావడంతో అధిక దిగుబడి వస్తుందని రైతులు తమ పొలాలలోకి మట్టిని కొనుగోలు చేస్తున్నారు. ఇటుక బట్టీలకు కూడా సరఫరా చేస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు 300 ట్రిప్పుల వరకు మట్టిని తరలించినట్లు సమాచారం. మట్టిని తరలించడానికి ప్రభుత్వ వాహనాలను కూడా వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ వాహనాలలో తరలిస్తుండడంతో గ్రామానికి చుట్టుపక్కల రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. దీనిపై కుకునూరుపల్లి ఎమ్మార్వో సుజాతను వివరణ కోరగా మట్టి తరలింపు అంశం మా దృష్టికి రాలేదని అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నల్ల మట్టిని టిప్పర్లలో లోడ్ చేస్తున్న ఎక్స్‌వేటర్.



'వర్గల్ నవోదయ'కు ద్వితీయ స్థానం

వర్గల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర రాష్ట్రం నాగపూర్ జిల్లాలోని నావోగావు కేరిలో జరిగిన 26వ ప్రాంతీయ స్థాయి యూత్ పార్లమెంట్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 4న జరిగిన ఈ పోటీల ఫలితాలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ బీపీ ఆచార్య ప్రకటించారన్నారు. గుజరాత్ రాష్ట్రం వల్సాడ్ జిల్లా జవహర్ నవోదయ విద్యాలయం ప్రథమ స్థానం సాధించిందన్నారు. వర్గల్ విద్యాలయ విద్యార్థులు బెన్‌హుర్ పాల్, రామ్‌చరణ్, ఆదీనాథ్, అభినవ్, నక్షత్ర, వైశాలి, శ్రీమణి, వైష్ణవి ఉత్తమ ప్రతిభ ప్రదర్శించారన్నారు. న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందిస్తారన్నారు.

కోహీర్ ఓటర్లు @ 36,834

● పురుషులు 18321 వేలు, స్త్రీలు 18512, ఇతరులు 01

కోహీర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలోని 23 గ్రామపంచాయతీల్లో 36,834 మంది ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో భారతి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇటీవల ఆయా గ్రామాల్లో చేపట్టిన నూతన ఓటరు నమోదు, వార్డుల విభజన, సవరణ తర్వాత తుది ఓటరు జాబితా ప్రకారం మండల వ్యాప్తంగా 36,834 మంది ఓటర్లు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. మండల కేంద్రమైన కోహీర్ పంచాయతీగా ఏర్పడక ముందు 47,319 ఓటర్లు ఉండగా.. ఇటీవల కోహీర్ మున్సిపల్‌గా ఏర్పడింది. అయితే కోహీర్ మున్సిపల్ మినహా ప్రస్తుతం మండలంలోని 23 గ్రామపంచాయతీలో 36,834 ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.


జిన్నారం: నూతన మున్సిపాలిటీ గడ్డపోతారం

గ్రామాలవారీగా ఓటర్లు

బడంపేట 1,089, బిలాల్‌పూర్ 3,428, చింతల ఘట్టు 1405, దిగ్వాల్ 4,096, గోటిగర్‌పల్లి 2,068, గురుజువాడ 1,512, కవేలి 2,182, ఖానాపూర్ 1,100, కొత్తూర్ (డి) 563, కొత్తూర్ (కే) 844, మాచిరెడ్డిపల్లి 1,614, మద్రి 1,716, మనియర్‌పల్లి, 2,091, నాగిరెడ్డిపల్లి 1,710, పైడిగుమ్మల్ 2,278,పర్వపల్లి 1,038, పీచేర్యాగడి 2,149, పీచేర్యాగడి తండా 661, పోతిరెడ్డిపల్లి 1,049, రాజనెల్లి 929, సజ్జాపూర్ 1,215, సిద్ధాపూర్ తండా 457, వెంకటాపూర్ 1,640, ఓటర్లు ఉన్నారు.

జెడ్పీటీసీ స్థానంగా చౌటకూర్

పుల్‌కల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలంగా ఆవిర్భవించడంతో జడ్పీటీసీ స్థానం కొత్తగా ఏర్పడినట్లయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ జడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు జరుగనున్నాయి. ఈ మండలంలో 15 గ్రామపంచాయతీలు, 6 ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు జరుపనున్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉండటంతో నాయకులు బరిలో ఉండేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లు తేలాల్సి ఉండటంతో ఏ స్థానం ఏప కేటగిరీకి కేటాయిస్తారో తెలియకపోవడంతో ఆశావాహుల్లో సందిగ్ధత నెలకొన్నది.

గడ్డపోతారం మున్సిపాలిటీలో 18 వార్డులు

● 5 గ్రామాలు.. 11,913 ఓటర్లు

జిన్నారం, ఫిబ్రవరి, 5 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం గడ్డపోతారం నూతన మున్సిపాలిటీలో 18 వార్డులు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గడ్డపోతారం కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతన మున్సిపాలిటీ ఏర్పాటు చేయగా ఇందులో కాజీపల్లి, వావిలాల, లక్ష్మీపతిగూడెం, మాదారం గ్రామపంచాయతీలను విలీనం చేశారు. కాగా మున్సిపాలిటీలో (2011) జనాభా లెక్కల ప్రకారం 10,157 మంది జనాభా ఉండగా.. 2025 సంవత్సరం వరకు 14 వేల పైచిలుకు జనాభా చేరిందని అధికారుల అంచానా వేశారు. ఇక 11,913 మంది ఓటర్లు ఉండగా.. 18 వార్డులు ఏర్పాటుకానున్నాయి. దీంతో ఒక్కో వార్డుకు 660 మంది వరకు ఓటర్లు ఉండనున్నారు. కాగా మున్సిపాలిటీకి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అకౌంటెంట్, ఏఈ తదితర అధికారులు అదనపు బాధ్యతలు చేపట్టారు.

మిన్పూర్ చర్చి అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే

పాపన్నపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మిన్పూర్ చర్చి అభివృద్ధికి కృషి చేస్తానని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మిన్పూర్ చర్చి వార్షికోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చిలో ఎమ్మెల్యేకు బిషప్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మిన్పూర్ చర్చి సంఘ సభ్యులు చర్చికి ప్రహరీ మంజూరు చేయాలని కోరగా.. ఎన్నికల కోడ్ ఉన్నదని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల మెదక్‌లో ప్రసిద్ధి చెందిన చర్చి అభివృద్ధికి రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మిన్పూర్ చర్చి అభివృద్ధికి కూడా కృషి చేస్తామన్నారు. ఏడుపాయల ఆలయానికి వెళ్లే రోడ్డును కూడా డబుల్ రోడ్ చేయడం కోసం రూ.35 కోట్లు మంజూరు చేశామన్నారు. మెదక్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం యూసుఫ్‌పేటలో ఇటీవల పూరి గుడిసెలు దగ్ధమైన ఇద్దరు బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ రూబెన్ మార్క్, ప్రెసిల్లా పరిమళ రూబెన్, విన్‌స్టన్, సాల్మన్‌రాజ్, విమల్‌కుమార్, బహంకిరణ్, విల్సన్, జార్జ్, ఎబెనెజర్, రాజు, అనిల్‌కుమార్, డా.దయానంద్, నాయకులు పాల్గొన్నారు.


మిన్పూర్ చర్చి వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

● మెదక్ ఆర్డీవో రమాదేవి


చిన్నశంకరంపేట హైస్కూల్లో ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా సాగేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్థలం ఉంటే ఇందిరమ్మ ఇంటికి ప్రాధాన్యత

ఐడీఏబొల్లారం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఖాళీ స్థలం ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటే మొదటి ప్రాధాన్యతా క్రమంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేటట్లు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. బుధవారం ఐడీఏబొల్లారం మున్సిపల్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డుల దరఖాస్తులు, పన్నులు వసూలు చేసే విధానాలపై వివరాలు అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తుల్లో విభజన చేసి స్థలం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఇందుకు తగ్గట్టుగా ప్రాధాన్యతాక్రమంలో విచారణ జరపాలన్నారు. పన్నుల వసూలు విషయంలో వార్డులను టార్గెట్‌గా పెట్టుకొని వసూలు చేయాలని కోరారు. ముందుగా పరిశ్రమల నుంచి వసూలు చేయాలని కోరారు. మూతపడిన పరిశ్రమల విషయంలో కఠినంగా వ్యవహరించి నోటీసులు జారీ చేయాలన్నారు. ఇంటి అనుమతుల విషయంలో ఆచితూచి వ్యవహరించాలని టీపీవో పవన్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఆర్‌వో నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

నాణ్యమైన భోజనం అందించాలి

● డీడబ్ల్యూవో హైమావతి


రెడ్డిపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న హైమావతి

చేగుంట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీడబ్ల్యూవో, మండల ప్రత్యేకాధికారి హైమావతి ఉపాధ్యాయులకు, సిబ్బందికి సూచించారు. చేగుంట మండలం రెడ్డిపల్లిలో కస్తూర్బా గాంధీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, కూరగాయలు, నిత్యావసర సరుకులు, మెనూచాట్, మధ్యాహ్న భోజనాన్ని, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, పాఠశాల రికార్డులను పరిశీలించి మాట్లాడారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రతతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్ వాణికి, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

82 రోజుల్లోనే నివేదిక ఇవ్వడం బాధాకరం

నారాయణఖేడ్/జహీరాబాద్/తూప్రాన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణకు సంబంధించి శమీముక్తార్ ఏకసభ్య కమిషన్ 82 రోజుల్లోనే నివేదిక ఇవ్వడం బాధాకరమని మాల మహానాడు ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు విశ్వనాథం అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే సర్వే చేసి నివేదిక ఇవ్వడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ మేరకు తమ సంఘం రాష్ట్ర కమిటీ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం స్థానిక నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెనక్కి తీసుకోవాలని మాల మహానాడు సంఘం జిల్లా నాయకుడు ఆకాష్, డివిజన్ అధ్యక్షుడు దిలీప్ పేర్కొన్నారు. జహీరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను మూడు భాగాలుగా చేస్తూ అసెంబ్లీలో ఆమోదం తెలుపడంతో ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు తూప్రాన్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నిరసన చేపట్టారు.



సంగారెడ్డి శివారులోని శ్రీవైకుంఠపురం కొలనులో చక్రస్నానం నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు, నిజాంపేటలో తిరుమలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రథాన్ని లాగుతున్న భక్తులు

శ్రీవైకుంఠపురంలో వైభవంగా చక్రస్నానం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శివారులోని శ్రీ వైకుంఠపుం ఆలయ 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలోని కొలనులో చక్రస్నానం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యులు ఆధ్వర్యంలో చక్రస్నానం, సుదర్శన నారసింహ ఇష్ఠి, మహాపూర్ణాహుతి, కల్పవృక్షవాహన సేవ, సప్తవరణ, పుష్పయాగం కార్యక్రమాలు జరిపించారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ సతీమణి పద్మిణి చక్రస్నానం కార్యక్రమంలో పాల్గొన్నారు.

మూడోరోజు జనసంద్రం

నిజాంపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : తిరుమల స్వామి బ్రహ్మోత్సవాలు మూడోరోజైన బుధవారం ఆలయ అర్చకులు, ఆలక కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి గుడిచుట్టూ ఊరేగించారు. భక్తులు తండోపతండాలుగా వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ అక్కపల్లి రాంరెడ్డి, డైరెక్టర్ రమేష్ ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదినారాయణస్వామి కల్యాణం

జిన్నారం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కొడకంచి ఆదినారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత ఆదినారాయణుడి కల్యాణం జరిపించారు. 8న స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు.

ఘనంగా బీరప్పస్వామి విగ్రహాల ఊరేగింపు

కల్హేర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కల్హేర్‌లో మల్లికార్జున కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప, గణపతి, కామరతి, విగ్రహాల ఊరేగింపును నిర్వహించారు. మూడురోజులపాటు జరుగనున్న బీరప్పస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. కల్హేర్ గ్రామ శివారులో నిర్మించిన ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నుంచి వచ్చిన విగ్రహాలను రాంమందిర్ వద్ద ఊరేగింపు నిర్వహించారు.

న్యూస్ బాక్స్

14న సేవాలాల్ జయంతి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సంత్ శ్రీసేవాలాల్ జయంతిని 14న ఘనంగా నిర్వహించుకోవాలని అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, ఖేడ్ మండలం కొండాపూర్ హనుమాన్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్ కోరారు. కొండాపూర్‌లోని హనుమాన్ ఆశ్రమం ఆవరణలో బుధవారం ఖేడ్ నియోజకవర్గంలోని తండాల పూజారులు, నాయక్‌లు, కారోబార్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ సేవాలాల్ జయంతి 15న ఉండగా తండాల్లో భోగ్ భండార్, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఉన్నందున, సమయం సరిపోని కారణంగా 14న జయంతి నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు.

'అనుమతి లేకుండా నిర్మించిన షెడ్లపై చర్యలు తీసుకోవాలి'

పటాన్‌చెరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా, నాలా మార్పిడి జరగకుండా వ్యవసాయ భూముల్లో నిర్మిస్తున్న భారీ షెడ్లపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు అమీన్‌పూర్ డిప్యూటీ తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ నాయకుడు నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

జిన్నారం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో 12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపును కల్పించిన ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి బీజేపీ జిల్లా, మండల నాయకులు నర్సింగరావు, ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి, జగన్‌రెడ్డి, రమేష్, సుధాకర్, మద్దూరి రాజు, వెంకటేశ్, వీరేశ్, మహేష్ క్షీరాభిషేకం చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

జిన్నారం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిన్నారంలో నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి బీఆర్‌ఎస్ నాయకుడు గడీల శ్రీకాంత్ గౌడ్ రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశంగౌడ్, బోజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌తో ఆదా

కల్హేర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : డ్రమ్ సీడర్ వ్యవసాయ పరికరంతో వేసిన వరి నాటు వల్ల రైతుకు ఎకరాకు రూ.4 వేలు ఆదా అవుతుందని ఖేడ్ వ్యవసాయ సహాయ సంచాలకుడు నూతన్‌కుమార్ అన్నారు. సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్ గ్రామ శివారులో డ్రమ్ సీడర్‌తో వేసిన వరి పంటను బుధవారం రైతులతో కలిసి ఆయన పరిశీలించారు.

'సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'

నారాయణఖేడ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భారతీయ న్యాయ సంహిత చట్టంలోని సెక్షన్ 106(1) రద్దు చేయాలని, రవాణా రంగ కార్మికులకు ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ ఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లో బుధవారం సిర్గాపూర్, కంగ్టి రూట్‌కు సంబంధించిన ఆటో కార్మికులు సీఐటీయూలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

స్వయం ఉపాధి కోసం దరఖాస్తుల ఆహ్వానం

నర్సాపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని దివ్యాంగులు స్వయం ఉపాధికోసం దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో హేమభార్గవి తెలిపారు. బుధవారం సీడీపీవో విలేకరులతో మాట్లాడుతూ మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అర్హులైన దివ్యాంగులకు 50వేలకు సంబంధించి 25 యూనిట్లు మంజూరు చేశారని, అర్హులైన దివ్యాంగులు 12వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన కృష్ణమూర్తి డిసెంబరు 23న అనారోగ్యంతో మృతిచెందాడు 1993-94 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన బాల్యమిత్రులంతా కలిసి మృతుని ఆర్థిక పరిస్థితి తెలుసుకున్నారు. బాధిత కుటుబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

ముగిసిన ఉర్సె షరీఫ్

మెదక్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఉర్సె షరీఫ్ ఉత్సవాలు మండల పరిధిలోని అలియాబాద్‌లో మూడురోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ముగింపు సందర్భంగా నిర్వాహకుడు ఫహీం కావాలి బృదం భజన, పాటలతో భక్తులను అలరించారు. సర్వమతాలకు ఉర్సె షరీఫ్ ఉత్సవాలు ప్రత్యేకంగా నిలుస్తాయని ఫహీం తెలిపారు. ఈ ప్రార్థనల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే తనయుడు సాయికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు విఠల్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పోచయ్య, నసీరోద్దీన్ పాల్గొన్నారు.

'ఢిల్లీ' సాహిత్య కార్యక్రమాలకు 'మహ్మద్‌షరీఫ్'కు ఆహ్వానం


మహ్మద్ షరీఫ్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డికి చెందిన ప్రముఖ కవి, విశ్రాంత తెలుగు భాషోపాధ్యాయులు మహ్మద్‌షరీఫ్‌కు ఢిల్లీ నుంచి ఆహ్వానం వచ్చింది. తెలుగు సాహితీ కళాపీఠం, అనంత సాంస్కృతిక వేదిక, ఆదిలీల ఫౌండేషన్ సంయుక్తంగా తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో ఈ నెల 8, 9న ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించే సాహిత్య కార్యక్రమాలు, నాటకం, అష్టావధానం, కవి సమ్మేళనంలో పాల్గొనేందుకు ఆయనకు అవకాశం లభించింది. ఢిల్లీ నుంచి ఆహ్వానం అందడం పట్ల మహ్మద్‌షరీఫ్‌కు సాహిత్య రంజని అధ్యక్షుడు వీ.పెంటారెడ్డి, మెతుకుసీమ అధ్యక్షుడు పీ.లింగాగౌడ్, మెరసం కార్యదర్శి సూర్యనారాయణశర్మ అభినందనలు తెలిపారు.

భావితరాలకు మార్గదర్శకం కావాలి

● మెదక్ జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు దొంతి నరేందర్


జిల్లా నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నరేందర్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అర్థగణాంక శాఖ ఉద్యోగులు భావితరాల ఉద్యోగులకు మార్గదర్శకం కావాలని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంతి నరేందర్ సూచించారు. బుధవారం స్థానిక సంఘ భవన్‌లో ఆ శాఖ ఉద్యోగుల జిల్లా ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్య ప్రణాళిక విభాగంలో విధులు నిర్వహించే ఉద్యోగులు అన్ని శాఖలతో అనుసంధానమై ఉంటారన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సురేష్, కార్యదర్శిగా మహేందర్ రెడ్డి, కోశాధికారి ఏలియా, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, జిల్లా సహ అధ్యక్షుడు ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

పశువులను సంరక్షించుకుందాం

● డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త, హెడ్ డా.వరప్రసాద్

జహీరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పశువుల సంరక్షణ కోసం సంఘటితంగా కృషిచేద్దామని, డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త, హెడ్ డా.వరప్రసాద్, డా.కైలాష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దిడిగి శివారులో గల డీడీఎస్-కేవీకేలో రైతులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల్లో ఎదుగుదల, పునరుత్పత్తి, వాటికిఅందించే మేత, పశులకుసోకే వ్యాధులు తదితరాలపై ఎప్పటికప్పుడు రైతులు గమనిస్తూనే ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో భూములు సారవంతం

ఝరాసంగం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగుకు సేంద్రియ ఎరువులను వాడితే భూములు సారవంతంగా ఉండడంతో పాటు ఆహారపు ధాన్యాలు కలుషితం కావని డీడీఎస్ డైరెక్టర్ గిరిధర్‌బాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని చీల్కేపల్లి గ్రామంలో డీడీఎస్ ఆధ్వర్యంలో పాత పంటలను స్టాళ్లలో ఏర్పాటు చేసి ఎడ్లబండ్లపై ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతర కో ఆర్డినేటర్ వినయ్ కుమార్, డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు నర్సమ్మ, చుక్కమ్మ, చిన్ననర్సమ్మ, గ్రామస్థులు మొగులమ్మ, సంపత్‌కుమార్, నర్సింహులు, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య కిషన్‌రావు అంత్యక్రియలు


కిషన్‌రావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతిచెందిన సీనియర్ న్యాయవాది కిషన్‌రావు అంత్యక్రియలు బుధవారం స్వగ్రామమైన నాగల్‌గిద్ద మండలం ఏస్గీ గ్రామంలో అశ్రునయనాల మధ్య నిర్వహించారు. ఇందులో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మశ్చేందర్, ఖేడ్ మాజీ సర్పంచ్ కిష్టయ్యమాస్టర్, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్‌శెట్టి, ఎంఐఎం నారాయణఖేడ్ అధ్యక్షుడు మోహిద్‌పటేల్, న్యాయవాదులు, నాయకులు పాల్గొని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

డెలివరీకి వస్తే డబ్బులు డిమాండ్

● సీఐటీయూ నాయకుల ఆరోపణ

మెదక్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పైసలిస్తేనే కొండాపూర్ పీహెచ్‌సీయూలో డెలివరీలు చేస్తున్నారని, లేకుంటే సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల పీహెచ్‌సీయూ మెడికల్ అధికారికి వినతిపత్రం అందజేశారు, ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ మూడురోజుల క్రితం ఆస్పత్రికి డెలివరీకి వస్తే పైసలిస్తే.. తప్పా డెలివరీ చేయమంటూ సిస్టర్స్, అటెండర్లు డిమాండ్ చేసినట్లు తెలిపారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు చేస్తామని హెచ్చరించారు.

'సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి'

వెల్దుర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తల సహకారంతో మహిళా కాంగ్రెస్ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు భవాని అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలో సభ్యత్వ నమోదుపై జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, నాయకులు, కార్యకర్తలకు సూచనలు అందజేశారు.

ట్రాక్టర్ ఢీకొని కార్మికుడి మృతి

హత్నూర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ ఢీకొని కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కాసాల గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. కాసాల గ్రామానికి చెందిన పాముల కిరణ్(35) గుండ్లమాచునూర్ గ్రామ సమీరంలో గల ఎపిటోరియా యూనిట్-9 ఫార్మా పరిశ్రమలో పనిచేస్తున్నాడు. రాత్రి విధులకు హాజరయ్యేందుకు తన బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులో ప్రధాన రోడ్డుపై ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిరణ్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నర్సింగ్ హోమ్‌లు తనిఖీ

వెల్దుర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎంపీ కేంద్రాల్లో పరిమితికి మించి చికిత్స అందిస్తే ఆర్ఎంపీలపై చర్యలు తప్పవని జిల్లా డెమో అధికారి శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఆర్ఎంపీ కేంద్రాలు, నర్సింగ్‌హోమ్‌లు, ల్యాబ్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించారు.

కారు అదుపు తప్పి పలువురికి గాయాలు

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : 161వ జాతీయ రహదారిపై పెద్దశంకరంపేట మండల పరిధిలోని కమలాపూర్ వద్ద హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఆనంద్‌రావు, సురేఖ, జ్ఞానేశ్వర్, శివరంజనీ 9 నెలల బాబుకు గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.